క్లుప్తంగా

శాకంబరిగా దుర్గాదేవి



పాత రేసపువానిపాలెంలో కొలువుదీరిన దుర్గాదేవి అమ్మవారు శుక్రవారం శాకంబరి దేవిగా దర్శనమిచ్చారు. భక్తులు పెద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి గురునాథశర్మ, కమిటీ సభ్యులు ఆ.గురునాథ్‌రెడ్డి, బాచి, ఈశ్వరరావు, కోటి, ప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్

ఉత్సాహంగా క్రీడా పోటీలు



టాస్ వేసి క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న హెచ్‌ఎం సుమతీబాయి

ఎంవీపీ కాలనీ: ఈస్ట్ పాయింట్ కాలనీ జీవీఎంసీ కేడీపీఎం పాఠశాలలో ఉత్సాహంగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొద్ది రోజులుగా పాఠశాల విద్యార్థులకు ఇక్కడ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల పీడీ రత్నం తెలిపారు. ప్రస్తుతం క్రికెట్ పోటీలు సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయన్నారు. సెమీ ఫైనల్స్ పోటీలను శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం సుమతీబాయి టాస్ వేసి ప్రారంభించారు. అన్ని క్రీడల్లోను విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు.

మెగా జాబ్‌మేళాలో 360 మంది ఎంపిక



అభ్యర్థులకు ఎంపిక పత్రాలు అందజేస్తున్న అధికారులు

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు స్పందన లభించింది. 8 ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో 1090 ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూలకు 523 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 360 మంది ఎంపికైనట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి, శాంతి తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. జూనియర్ ఉపాధి అధికారి సీహెచ్ కుమారస్వామి, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్‌పై దృష్టి



హార్బర్‌ను సందర్శించిన డీసీపీ–2 ఏసీపీ మోజెస్ పాల్

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్‌పై పోలీసులు దృష్టి సారించారు. ఇటీవల హార్బర్‌లో నేరాల సంఖ్య, ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయింది. ఈ పరిణామాలను స్వయంగా పరిశీలించేందుకు శుక్రవారం డీసీపీ–2 తుహిన్ సిన్హా హార్బర్‌లో పలు ప్రాంతాలను సందర్శించారు. అక్కడి పరిస్థితులను ఏసీపీ మోజెస్ పాల్ డీసీపీ–2కి వివరించారు. హార్బర్‌లో పెరుగుతున్న ట్రాఫిక్‌కు సంబంధించి తీసుకోవలసిన చర్యలపై డీసీపీ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.భాస్కరరావు, ట్రాఫిక్, నేర నియంత్రణ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాలి

- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశం
- 9, 12, 13 వార్డుల్లో విస్తృత పర్యటన



ఆరిలోవ కాలనీలో చెత్త సేకరించే వాహనం పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్



అధికారులతో కలసి ముడసర్లోవ డంపింగ్ యార్డు పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

ఆరిలోవ: కాలనీల్లోని వీధులు, కాలువలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుతూ పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాలని పారిశుధ్యం విభాగం అధికారులు, కార్మికులను జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. జోన్–2 పరిధిలో 9, 12, 13 వార్డుల్లో ఆయన శుక్రవారం అధికారులతో కలిసి పర్యటించారు. 9, 12 వార్డుల్లోని గెడ్డల ఆధునికీకరణ పనులు పరిశీలించారు. వర్షా కాలం కావడంతో త్వరగా పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. సంజయ్‌గాంధీకాలనీ, ఆరిలోవ కాలనీలలో జరుగుతున్న అన్నా క్యాంటీన్ మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం 13వ వార్డులోని ముడసర్లోవ రిజర్వాయరు వెనక జీవీఎంసీ డంపింగ్ యార్డును సందర్శించారు. ఇక్కడికి నగరంలోని ఏయే ప్రాంతాల నుంచి చెత్త వస్తుంది.. ఇక్కడి నుంచి రోజుకు ఎన్ని లారీలతో కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు.. ఇక్కడున్న యంత్రాలు.. తదితర వాటి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముడసర్లోవ వద్ద ఎంఎస్‌ఎఫ్–2ని కూడా కమిషనర్ పరిశీలించారు. ఇక్కడ క్లోజ్డ్ కంపోస్ట్ సిస్టం ఏ విధంగా పని చేస్తుందో తనిఖీ చేశారు. వాహనాలతో తరలించే వ్యర్థాలు రోడ్డుపై పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీల్లో పారిశుధ్యం మెరుగు గురించి అధికారులతో చర్చించారు. వర్షా కాలం కావడంతో దోమలు వృద్ధి చెందుతాయని, సీజనల్ వ్యాధులకు ప్రజలు గురయ్యే అవకాశం ఉందని కమిషనర్ హెచ్చరించారు. మలేరియా, డెంగ్యూ, అతిసార వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. గెడ్డలు, కాలువల్లో పూడిక వెంట వెంటనే తొలగించాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల కాలువల్లో గ్రిల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ పర్యటనలో ఇంజినీరింగ్ అధికారులు శాంతిరాజు, శాంసన్‌రాజు, జోన్–2 కమిషనర్ శైలజావల్లి, ఏఎంహెచ్ఏ డాక్టర్ కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు టీడీపీ ఫ్లెక్సీల తొలగింపు



ఆరిలోవ కాలనీ ఆఖరు బస్టాప్ వద్ద తొలగించిన టీడీపీ ఫ్లెక్సీలు



డెయిరీ ఫారం కూడలి వద్ద తొలగించిన ఫ్లెక్సీలు

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో టీడీపీ ఫ్లెక్సీలను శుక్రవారం జీవీఎంసీ జోన్–2 అధికారులు ఎట్టకేలకు తొలగించారు. గత నెల 30 నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న విషయం తెలిసిందే. అయినప్పటికీ ఆరిలోవ ప్రాంతంలో ఎక్కడికక్కడ రోడ్ల పక్కన టీడీపీ నాయకుల ఫ్లెక్సీలను అధికారులు తొలగించకుండా వదిలేశారు. దీనిపై 'ఆరిలోవలో కోడ్ వర్తించదా' శీర్షికతో సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీంతో టౌన్ ప్లానింగ్ ఏసీపీ శాస్త్రి ఆదేశాలతో స్క్వాడ్ సిబ్బంది రమేష్, సచివాలయాల సిబ్బంది లలిత తదితరులు ఆరిలోవ కాలనీ, టీబీసీ పాయింట్, రవీంద్రనగర్, తోటగరువు, డెయిరీ ఫారం కూడలి వద్ద టీడీపీ, జనసేన పార్టీ నాయకుల ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీలను తొలగించారు.

తల్లిపాలే పిల్లలకు శ్రేష్టం



రాజేంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలపై అవగాహన పోస్టర్లతో బాలింతలు, గర్భిణులు



ఇసుకతోట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న కార్యకర్త ఈర్ల దేవి

ఆరిలోవ: తల్లిపాలు వారోత్సవాలు నియోజకవర్గంలో కొనసాగుతున్నాయి. శుక్రవారం ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ చినగదిలి సెక్టార్ రాజేంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు కామేశ్వరి, అన్నపూర్ణ, ఆశా కార్యకర్త చంద్రకళ మాట్లాడుతూ తల్లిపాలే పిల్లలకు శ్రేష్టమైనవని తెలిపారు. పుట్టిన ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలే పట్టాలని సూచించారు. దీని వల్ల పిల్లలకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

మద్దిలపాలెం: ఇసుకతోట అంబేడ్కర్ కాలనీ–2 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త ఈర్ల దేవి మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. తల్లిపాలు పుట్టిన బిడ్డకు తొలి టీకాలా పని చేస్తుందన్నారు. పుట్టిన గంటలోపు తల్లి పాలు ఇవ్వాలని సూచించారు. సీడీపీవో రమణకుమారి, ఏసీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్ సెల్వియా పర్యవేక్షణలో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

స్వాతంత్రోద్యమానికి 'పింగళి' జాతీయ పతాకం స్ఫూర్తి



పింగళి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ సీతామాణిక్యం



పింగళి వెంకయ్య చిత్ర పటానికి అంజలి ఘటిస్తున్న ఉపాధ్యాయులు

విశాఖ సిటీ: భారత జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య తెలుగువారు కావడం గర్వించదగ్గ విషయమని ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీతామాణిక్యం అన్నారు. స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఏయూ న్యాయ కళాశాలలో పింగళి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం రావడానికి పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ పతాకం ఎంతో స్ఫూర్తినిచ్చిందన్నారు. ఆచార్య కె.పల్లవి మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఒక రోజు ముందుగా జెండా ఉంచా రహే హమారా 25 వేల చదరపు అడుగుల పతాకం ప్రదర్శనలో విద్యార్థులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఆచార్యులు విజయలక్ష్మి, ఎల్.వి.కె.ప్రసాద్, రాజ్యలక్ష్మి, చంద్రకళ, ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపకుడు డాక్టర్ సుంకరి రమణమూర్తి, స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి, సభ్యులు నరేష్, మహమ్మద్ ఇషాక్, తదితరులు పాల్గొన్నారు.

పింగళికి ఘన నివాళి

మద్దిలపాలెం: పాత వెంకోజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పింగళి చిత్ర పటానికి పాఠశాల హెచ్‌ఎం సిహెచ్.జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏయూ విభాగాల సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏయూ ఇన్‌చార్జి వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీలోని పలు విభాగాలను వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య జి.శశిభూషణరావు శుక్రవారం సందర్శించారు. ముందుగా ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని సందర్శించి ఎంహెచ్ఆర్ఎం సెమిస్టర్ పరీక్ష జరుగుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. పరీక్షకు హాజరైన విద్యార్థులు, పరీక్ష నిర్వహణ విధానాన్ని గమనించారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించే బాస్కెట్ బాల్ మైదానాన్ని సందర్శించారు. అక్కడ చేయాల్సిన ఏర్పాట్లపై సెక్యూరిటీ డీన్ ఆచార్య అరుణ్‌కుమార్‌తో చర్చించారు. ఏయూ న్యాయ కళాశాలలో తరగతులు జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి తరగతులు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలిగినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వీసీ వెంట ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.సీతామాణిక్యం, ఎ.నరసింహారావు, తదితరులు ఉన్నారు.

నీటి నిల్వలే దోమల ఉత్పత్తి నిలయాలు



లక్ష్మీనగర్‌లో నిల్వ నీటి పారబోస్తున్న జీవీఎంసీ వైద్య సిబ్బంది

మద్దిలపాలెం : నీటి నిల్వలు దోమల ఉత్పత్తికి ఆవాసాలుగా మారుతున్నాయని, ఎప్పటికప్పుడు ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా విభాగం ఆరోగ్య కార్యకర్త కె.వేణుగోపాల్ సూచించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శివాజీపాలెం పరిధి లక్ష్మీనగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. వారం పైబడి నిల్వ నీటిలో లార్వా ఉత్పత్తి అయి, దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఆ దోమల కాటు వల్లనే డెంగ్యూ, మలేరియా జ్వరాలు వ్యాపిస్తాయని చెప్పారు. ఖాళీ టైర్లు, కొబ్బరి బొండాలు, రుబ్బురోళ్లలో నీటి నిల్వలు ఉంటే తొలగించాలని సూచించారు. ఉచితంగా పంపిణీ చేసిన దోమ తెరలను వాడాలన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పరిసరాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది, యాంటీ లార్వా బృందం సభ్యులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం బస్టాప్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలిస్తున్న పోలీసులు

ఎంవీపీ కాలనీ: మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ ను ఆనుకుని ఉన్న బస్టాప్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. స్థానిక ఆటో డ్రైవర్ల సమాచారం మేరకు శుక్ర వారం ఎంవీపీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అయితే మృతుడి వివరాలు తెలియరాలేదు. దీంతో ఎంవీపీ సీఐ సంజీవరావు ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్ ప్రతినిధుల సహాయంతో మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. గుర్తుతెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి అతని వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నట్లు ఎంవీపీ పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు ఎంవీపీ పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. కొద్ది రోజులు వేచి చూసిన అనంతరం అంత్యక్రియలు నిర్వహిస్తామని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం



ఏయూలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న ఏయూ దళిత సంఘాల నాయకులు

ఎంవీపీ కాలనీ: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై ఏయూ దళిత సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు దళిత సంఘాల ఉద్యోగుల ఆధ్వర్యంలో ఏయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత ఉద్యోగులతో పాటు ప్రస్తుత, మాజీ ఆచార్యులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం విగ్రహం ప్రాంగణంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ సుప్రీం తీర్పుతో ఎస్సీలు అందరికీ సమన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య అబ్బులు, డాక్టర్ ముసుగు ప్రసాద్, డాక్టర్ ప్రకాష్, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ సుంకర రమణమూర్తి, డాక్టర్ జార్జి బంగారి, వర్సిటీ మాజీ ఆచార్యులు యోహన్ బాబు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై మేధావులు ఆలోచించాలి



నిరసన తెలుపుతున్న ఆంధ్రా యూనివర్సిటీ మాలల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు

విశాఖ సిటీ: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను ఆమోదిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై దేశంలో ఉన్న మేధావులు ఆలోచన చేయాలని ఆంధ్రా యూనివర్సిటీ మాలల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు కోరారు. ఏయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రస్తుత తీర్పు రాజ్యాంగంలోని రాజ్యాంగ పీఠిక ద్వారా సంక్రమించిన సమన్యాయం సామ్యవాద సూత్రాల మౌలిక స్వరూపాన్ని మార్చే విధంగా ఉందని, దీనిపై ప్రజాప్రతినిధులు ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా 20 శాతం ఉన్న ప్రజలు 80 శాతం రిజర్వేషన్లను అనుభవిస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా అందాలంటే తక్షణమే కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన ఎవరి వాటా వారికి అందినప్పుడే సమన్యాయం సాధ్యమవుతుందని తెలిపారు. అప్పటి వరకు ఎస్సీ ఎస్టీ వర్గీకరణను నిలిపివేసి పార్లమెంట్లో ఈ చట్టంపై సమగ్రమైన చర్చ జరపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏయూ మాల మహానాడు జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డాక్టర్ బి.మోహన్‌బాబు, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ వరుణ్ చైతన్య, డాక్టర్ శిరీష్ కుమార్, డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య, డాక్టర్ ప్రేమానందం, డాక్టర్ సిద్ధయ్య, డాక్టర్ దేవా, డాక్టర్ సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి కేసులో నిందితుల అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న క్రైం డీసీపీ వెంకట రత్నం, తదితరులు

బీచ్ రోడ్డు: ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసి నగదు చోరీ చేసిన నిందితులను అరెస్ట్ చేసినట్టు క్రైమ్ డీసీపీ పి.వెంకటరత్నం తెలిపారు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె ఈ కేసు వివరాలు వెల్లడించారు. ఆర్టీసీ డ్రైవర్ గనిరెడ్డి మారినాయుడు శుక్రవారం అమలాపురం–విశాఖ బస్సు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తనకు జ్వరంగా ఉండడంతో మద్దిలపాలెం రోడ్డులో బస్సును ఆపి, సమీపంలో ఉన్న అపోలో ఫార్మసీ వద్ద టాబ్లెట్ తీసుకున్నాడు. ఇంతలో నలుగురు వ్యక్తులు వచ్చి ఆయన చేతిలో ఉన్న బ్యాగును లాక్కొని పరారయ్యారు. వారిలో కిరణ్ డ్రైవర్ మీద దాడి చేశాడు. బ్యాగులో రూ.3 వేల నగదు ఉంది. ఈ మేరకు ఈ ఘటనపై శుక్రవారం తెల్లవారుజామున 112కి ఫోన్ కాల్ ద్వారా ఫిర్యాదు అందింది. వెంటనే ఎంవీపీ, త్రీ టౌన్ పోలీసులు అప్రమత్తమయ్యారు. రాత్రి గస్తీ ముమ్మరం చేశారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. అందరూ పాత రేసపువానిపాలెంలో నివాసం ఉంటున్నారు. వారిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు డీసీపీ తెలిపారు. కిరణ్, పిలక సదానందతో పాటు ఇద్దరు మైనర్లు అరెస్ట్ చేశామన్నారు. కిరణ్ మీద ఇప్పటికే ఒక కేసు ఉందని చెప్పారు. ఈ సమావేశంలో క్రైం ఏసీపీ ఎ.వెంకటరావు, త్రీ టౌన్ క్రైం సీఐ ఆడం, ఎంవీపీ క్రైం సీఐ సిహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బహిరంగ వేలం వాయిదా

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ జోన్–5 జ్ఞానాపురం కార్యాలయంలో ఈ నెల 5న నిర్వహించాల్సిన బహిరంగ వేలం అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్టు జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి ప్రకటనలో వేలం ఎప్పుడు నిర్వహించేదీ తెలుపుతామని, పూర్తి వివరాలకు జోన్–5 జోనల్ కార్యాలయ పర్యవేక్షకుడిని పని వేళల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని ధర్నా



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న పీడీఎస్‌వో నాయకులు

సీతమ్మధార : ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌వో ఆధ్వర్యంలో ప్రతినిధులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.విశ్వనాథ్, వి.లక్ష్మి మాట్లాడుతూ రానురాను సంక్షేమ కళాశాలల హాస్టళ్లలో సమస్యలు తీవ్రమవుతున్నాయని అన్నారు. విశాఖ జిల్లావ్యాప్తంగా 18 బీసీ కళాశాలల హాస్టళ్లు ఉండగా దశాబ్దాలు గడుస్తున్నా మూడు హాస్టళ్లకు తప్ప మిగతా వాటికి సొంత భవనాలు లేవని అన్నారు. అలాగే హాస్టళ్లలో సరైన తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులే బయటి నుంచి టిన్నులతో నీరు తెచ్చుకుంటున్నారని తెలిపారు. సీజనల్ వ్యాధులతో విద్యార్థులు బాధలు పడుతున్నారన్నారు. గతంలో పాత బియ్యం హాస్టళ్లకు సరఫరా చేస్తాం అని చెప్పినప్పటికీ అది అమలు కావడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని విద్యార్థులు పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. సకాలంలో మెస్ బిల్లులు విడుదల కాక మెనూ అమలు చేయలేమని వార్డెన్లు తెగేసి చెబుతున్నారని తెలిపారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అన్ని హాస్టళ్లలో ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎస్. రుద్రి, జిల్లా కమిటీ సభ్యులు ఈశ్వర్, లక్ష్మణ్, సతీష్, మధు, లోకేష్, జానకి, హాస్టల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గంటలో దొంగను పట్టుకున్న పోలీసులు



మహిళకు ఆభరణం అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ : ఆటోలో ఒక మహిళ నుంచి బంగారు ఆభరణాన్ని కొట్టేసిన వ్యక్తిని గంటలోనే పోలీసులు పట్టుకుని బాధితురాలికి నగ అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. గురువారం సాయంత్రం దొండపర్తి ప్రాంతానికి చెందిన వరలక్ష్మి అనే మహిళ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న లలితా జ్యూయలర్స్‌లో పావు తులం బంగారు ఆభరణం కొనుగోలు చేశారు. అక్కడి నుంచి ఆటోలో ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆ నగను కొట్టేశాడు. దీంతో ఆమె వెంటనే నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు డీసీపీ (క్రైమ్) వెంకటరత్నం పర్యవేక్షణలో ఒక ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి గంటలోనే ఆ వ్యక్తిని పట్టుకుని నగ స్వాధీనం చేసుకున్నారు. దాన్ని సీపీ చేతుల మీదుగా బాధితురాలు వరలక్ష్మికి శుక్రవారం అందజేశారు.

చల్లగాలితో ఉపశమనం



మేఘమాలికల నడుమ జగదాంబ వద్ద గల క్లాక్ టవర్

డాబాగార్డెన్స్ : ఉదయం నుంచి ఉక్కపోతతో ఇబ్బంది పడిన నగర జీవి.. సాయంత్రం వాతావరణంలో ఒక్కసారిగా మార్పు రావడంతో ఉపశమనం పొందాడు. నల్లటి మేఘాలకు.. చల్లటి గాలులు తోడవ్వడంతో సేదదీరాడు. జగదాంబ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన క్లాక్‌టవర్ నల్లటి మేఘాలకు మరింత అందంగా కనిపించింది.

న్యాయవాదులకు మార్గదర్శకం 'బైపా'



బైపాను సత్కరించిన అనంతరం మాట్లాడుతున్న కృష్ణమోహన్

డాబాగార్డెన్స్ : ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధే ధ్యేయంగా తన జీవితాన్ని అంకితం చేయడమే కాక న్యాయవాదులకు మార్గదర్శకం బైపా అరుణ్‌కుమార్ అని రాష్ట్ర బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. సమాజంలో న్యాయవాదుల పాత్ర అనే అంశంపై శుక్రవారం డాబాగార్డెన్స్‌లో గల బీకేపీ చాంబర్స్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తానూ, బైపా అరుణ్‌కుమార్ ఎంతో కాలంగా కలిసి న్యాయవాద వృత్తిలో పని చేశామని, ఆయన క్రమశిక్షణ గల వ్యక్తి అని కొనియాడారు. బైపా వద్ద అనేక మంది జూనియర్లు శిక్షణ పొంది ఎంతో మంది జడ్జీలుగా రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్నారంటే అది ఆయన కృషికి నిదర్శనమన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు బైపా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి న్యాయవాది తన వృత్తిలో కృషితో ఎదగాలన్నారు. ఈ సందర్భంగా బైపా అరుణ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది ఐఎం అహ్మద్, న్యాయవాదులు డాక్టర్ తిగురుపల్లి బోసుబాబు, గుడిపల్లి సుబ్బారావు, వాగుపల్లి చిన్నారావు, ఫసీయుద్దీన్, శారద, సంపత్, జార్జి బంగారయ్య, కార్పొరేటర్ కేవీఎన్ శశికళ తదితరులు పాల్గొన్నారు.